# విమానం, వీరమ్మ

రచన : నివేదిత

విమానం అనగానే పుష్పక విమానం గుర్తుకొచ్చేది వీరమ్మకు. నిజమైన విమానమంటే ఆనాడు శ్రీరామచంద్రుడు రావణాసురుణ్ణి చంపి సీతా సమేతంగా హనుమదంగదాదులతో సాకేతపురం చేరుకున్న ఆ విమానమే. 'ఇప్పుడు ప్రతిరోజూ మన నెత్తిమీదుగా పక్షులవలె ఆకాశంలో ఎగిరిపోయేవి, యూరోపియనుదొరలు కనిపెట్టిన మాయ విమానాలెన్రా! ఆనాడు శ్రీరామచంద్రుడు భరద్వాజాశ్రమంలో విమానాన్ని నిలిపి, బసచేసి, ఆతిథ్యాన్ని స్వీకరించి మళ్లా బయలుదేరాడు గదా! ఆ విమానం క్రిరన వచ్చునే! చెక్కు చెదరకుండా కూర్చున్న ఆ మహానుభావుల ఒళ్లు కదలకుండా వాయువేగంతో అయోధ్యను చేర్చింది. విమానమంటే అదీ! అంతేగాని పైకి వెళ్ళబోయేముందో, వెళ్ళిన తర్వాతో మండి కూలిపోతే అబ్బ ఎంత దుఃఖము ఎంత బాధ. విన్నారా మొన్న ఢిల్లీలో సఫ్దర్ జంగ్ విమానాశ్రయంలో అలాగే ఒక విమానం మండిపోయిందట. అయ్యో మాకు తెలిసిన వాళ్ళబ్బాయి ఇంకే ఉద్యోగం చెయ్యనని ఏదో 'ఏర్‌క్లబ్బంటారు' దాంట్లో చేరాడు. నా కప్పుడే తెలుసు వాణ్ణి యమధర్మరాజు పిలుస్తున్నాడని. మాఘమాసంలో వాళ్ళమ్మ నాతో చెప్పింది కుర్రవాడు విమాన నడపబోతున్నాడని. ఇంకా శ్రావణ మాసం వెళ్లకముందే నేను అనుకున్నంతా అయింది. కన్నవారిని దుఃఖ సముద్రములో ముంచేసాడు. వాడు ట్రైనింగు నేర్చుకుంటున్న విమానం చెట్టుకు కొట్టుకొని కూలిపోయినది. దేవుడి ధర్మమా అంటు వాడికి పెళ్ళికాలేదు. రక్షించాడు.

ఇంకో సంఘటన మా అమ్మాయి దగ్గర చదువుకుంటున్నది వసంత అనే ఆవిడ. ఎంత చక్కగా ఉంటుందనుకున్నారు. మా తల్లి, మహాలక్ష్మిలాగే ఉంటుంది. ఈ మాయవిమానమే ఆవిడ కుంకుమను తుడిచివేసింది. పాపం ఆమె ఒకరోజంతా తన కథ ఏకరువు పెట్టింది. అంటూ వంగి చూచి "ఏం సుబ్బక్కా తూగుతున్నావా! నెలబాలుడు క్రుంగలేదమ్మా అప్పుడే నిద్రపట్టిందా అని వీరమ్మ నిట్టూర్చింది.

అవ్వ నిద్రపోతేపోయే మాకు చెప్పవమ్మా పిన్ని అన్నారు కాంతమ్మ రంగమ్మ.

"రేపు కానిలే" అంటూ వీరమ్మ నులకమంచాన్ని కొబ్బరి చెట్టు దగ్గరికి లాగి దుప్పటి 'టఫీ'మని విదిలించింది. ఆ చప్పుడుకు గుంజనానుకుని, కునికిపాట్లుపడుతున్న సుబ్బక్క కళ్లుపులుముకుంటూ" చెప్పు వీరమ్మా! నేనెక్కడ నిద్రోయినాను - నీ విక్కడ ఉంటే నాలుగు రోజులే మాకు కథైనా, కాలక్షేపమైనా తర్వాతేముంది ఏకులు వడుక్కుంటుంటే ఈ పిల్లలు రంకుల పురాణం తప్ప ఇంకేమి మాట్లాడరమ్మా!

'ఏదో విని అఘోరించినట్లు ఎప్పుడు గురకేగా ఈ పెకు' అన్నట్లు కాంతమ్మ రంగమ్మ వెనక్కు తిరిగి మెటికలు విరిచారు.

వీరమ్మ మళ్ళీ అందుకొని "ఆ అమ్మాయికి పాతికేళ్లుంటాయి. మొగుడు కిరికెట్ ఆటేవాడంట.

"అంటే. ఏందమ్మా.

"అదోరకం బంతులాటలే. దాన్ని చూడ్డానికని డబ్బిచ్చి టిక్కట్టుకొని, ఎండలో మాడి, వానలో తడిసి, పట్నంలో అవస్థపడుతుంటారు."

"చెన్నపట్నంలోనే—"

"ఆ! మా అమ్మాయికూడ అప్పుడప్పుడు వెళ్తుంటుంది.

"ఆ వీరమ్మా! ఎంతైనా నీ కడుపు బంగారు కడుపు, లీలమ్మ పాబసరంటగా, సునీతమ్మ రేటపాటికి డాక్టరు. ఈ మా మొగాలు, మొగవికూడ నూకలు పైసలు వెళ్ళదీయకపోయిరిగా."

దానికేంగాని మన ఊళ్లోనే అందరు అపర బృహస్పతులు, అటు తూర్పు నాటగాని, కృష్ణగోదావరి డెల్టాల్లోగాని చూడు. కాపులపిల్లలు అమ్మో! ఎం.ఏలు, బియ్యేలు; అంతే కాదు అమెరికా ఇంగ్లాండు కూడ పోయి వస్తున్నారు. సరే కథవిను—

ఆ పిల్ల మొగుడు ఆ ఆటలో భలే మేధావట ఆ ఆట ఆడడానికి ఇంగ్లాడుకు వెళ్లాకుట అక్కణ్ణించి బహుమానాలు పొంది ఇంటికి వచ్చేటప్పుడు.

"విమానంలోనే!"

"ఆ అదే చెప్పవచ్చేది నాగపూరు దగ్గర విమానం పడిపోయిందట రామ! రామ!" అని సుబ్బక్క చెవులు మూసుకున్నది,

"ఢిల్లీ నుంచి రేపు ఉదయం ఇంట్లో ఉంటానని తంతి ఇచ్చాడుట. తంతి వచ్చిన ఒకగంట సేపటికల్లా విమానం పడిపోయిందన్న వార్త పత్రికలవారికి తెలిసి పోయింది. ఒక పత్రికలో ఆ పిల్ల అన్న పనిజేస్తుంటేవాడు అమాంతంగా పరిగెత్తుకొని వచ్చి చెప్పాడుట.

పాపం! ఇద్దరు పిల్లలు; ఇప్పుడు చదువుకుంటుంది మా అమ్మాయి దగ్గర.

ఎందుకు చెప్ప వచ్చానంటే ఈ మాయ విమానాల్లో వద్దు తల్లీ అని మా అమ్మాయి మొన్న ఢిల్లీకి వెళ్తాన న్నప్పుడు నెత్తిన నోరు పెట్టుకొని చెప్పాను. రెండురోజులు ఆలస్యమైనా సరే రైలులో వెళ్ళమన్నాను. సరే సుబ్బక్కా! నాకూ నిద్రవస్తుందని ఆవలించి వీరమ్మ గుప్పిటి విగదీసింది.

ఈ సంభాషణ నెల్లూరి జిల్లాలోని ఒక పల్లెలో జరిగింది. వీరమ్మ ఆవూరిలో ఘనమైన కామందని పేరు బడ్డ రామయ్య కూతురు. ఆమె భర్త నౌఖరి చేస్తున్నా వీరమ్మ తలిదండ్రులకు ఏక సంతానం కావడంవల్ల కనుపూరిలోనే ఎక్కువగా ఉంటూ ఉండేది. వీరమ్మ భర్తకు నోటికి చేతికి అందీ అందని సంపాదన కావడంవల్ల పిల్లలతో సహా భార్యను సంవత్సరానికి తొమ్మిది నెలలు పుట్టింట్లోనే ఉంచేవాడు. వీరమ్మకు ఐదుగురు ఆడ పిల్లలు మొగ పిల్లలు పుట్టారన్న ఆశ ఆశగానే ఉంది. వీరమ్మ భర్త కన్ను మూసాడు. రామయ్యగారు అల్లుడున్నంతవరకు మనవరాళ్ళ విషయంపట్టించుకోలేదు. ఇక తప్పదన్నట్లు అల్లుడుపోయిన ఆరు నెలల్లోనే పెద్ద పిల్లకు పొరుగూరి కరణం కొడుక్కిచ్చి పెండ్లిచేసాడు. రెండో పిల్లను, నాలుగో పిల్లను చదివించడానికి తన భార్యను పెట్టి నెల్లూరిలో కాపురం పెట్టాడు. మూడో పిల్లను పిల్లలు లేని బంధువుకు పెంపు డిచ్చినాడు. చంటి పిల్లతో వీరమ్మ తండ్రికి ప్రతి విషయంలో తలలో నాలుకవలె సహాయపడుతూ కనుపూరి లోనే ఉండేది. ఆ గ్రామంలో నాగరకత అంతగా వ్యాపించలేదనే చెప్పాలి ఇంకా పూర్వకాలపు ప్రేమాభిమానాలు ఆ గ్రామ ప్రజలలో నిలచే ఉన్నాయి. వీరిమ్మ భర్త పోయినప్పుడు గ్రామమంతా ఏడ్చింది. ఆమె రెండో కూతురు లీలమ్మ పట్నంలో చదువుకుంటుందని, నాలుగో కూతురు స్కూల్ ఫైనలు పూర్తిచేసిందని తమ పిల్లలు ఏదో సాధించట్లు ఆ వూళ్ళో ప్రతి వాళ్లు చెప్పుకునే వారు.

పది ఏండ్లలో వీరమ్మ తలిదండ్రులు కండ్లు మూసారు. చిన్న పిల్ల అనుకోని వినుకోక్కుండా చనిపోయింది. సరే పొలం అవి చక్క బెట్టుకోడం వీరమ్మ చేతికి కొట్టిన పిండి. తన తండ్రి చేస్తూ వచ్చిన ఆయుర్వేద వైద్యం కొంచము ఆమెకు కూడ తెలుసు. పిల్లలను చూడడానికి పట్నం వచ్చినప్పుడు, గోయినా మాత్రలు, అమృతాంజనం, నీలగిరి తైలం అవి కొనుక్కొని. వెళ్లి ఎవరు తలనొప్పి అన్నా, రొంప తగిలిందన్నా ఇచ్చేది. వీరమ్మ ఊళ్లో ఉంటే చాలునని ఆవూరి [illegible]. పట్నంలో ఒక కాలు ఊళ్ళో ఒక కాలుగా వీరమ్మ పిల్లలు చదువుకునేంతవరకు గడిపింది. పెద్దమ్మాయికి పిల్లలు పుట్టారు. లీలమ్మ ఎం. ఏ ప్యాసయి లెక్చరరు పనిచేస్తుంది. నాలుగో అమ్మాయి సునీతి ఎం. బి. బి. ఎస్. చదువుతుంది. వేమైనా సరే వీరమ్మకు పట్నం పట్నమే. కనుపూరిలో ఉన్న స్వేచ్ఛ, సంతోషం, సంతృప్తి ఆమెకు చెన్న పట్నంలో కనిపించక పోవడంలో ఆశ్చర్యం లేకపోయినా, మోయలేని స్థూలకాయాన్ని ఈడ్చుకుంటూ కేవలం మహానూలు సమయంలోనే కాక, నెల కొక్కసారైన ఆ కనుపూరు మట్టిగోడల మధ్య, పూత లేక పాతవడిన పూరింట్లో, దీపంబెట్టి, చావట్లో కొబ్బరి చెట్ల దగ్గర నులక మంచం మీద పండుకొని, తనకు చిర పరిచితులుగా కనిపించే కాపువనితలతో కాలక్షేపం చేయడం, వారి సుఖ దుఃఖాయి విచారించడంలో తన కుమార్తెలు భవిష్యత్తును గూర్చిన దానికన్నా ఆతురత కనబరచడం కొంచెము వింతగానే ఉండేది.

"అమ్మాయిలకు పెళ్లెప్పుడమ్మా!" అని అమ్మలక్కలడిగితే ఏమో ఆ పిల్ల లీల కృష్ణ రామా అంటూ కాల గడుపుకుంటానంటుంది. మా సునీతి ఈ వూళ్లో ప్రాక్టీసు పెట్టుంది. మా రెవ్వరింక నెల్లూరు వెళ్ళాలసిన పనిలేదు. అప్పుడు చూడండి. మా నాయన రామయ్య మనమరాలు అని ఎంత కీర్తి" అని పొంగిపొయేది వీరమ్మ.

పెళ్ళి వద్దంటమ్మా! అని వాళ్ళు ఆమెను సాగదీసి అడిగితే ఏం పెళ్ళి, పెద్దపిల్ల ఏం సుఖపడుతుంది. కూనా, కురుచ సంతానం. మొగుడొక యముడు. అత్తగారొక లంకిణి. పెంపుడిచ్చిన మూడోపిల్ల మాత్రం డబ్బుండే తప్ప సుఖమేముంది? చాలేమ్మా - నా పిల్లలిద్దరు దేశానికి సేవచేస్తారు.

వింతమనిషివమ్మా వీరమ్మా! కన్న తల్లివి ఇట్లా అనడం ఏం బాగోలేదు.

బాగో లేకపోతే ఏం మీ గతకైన తలా పదివేలు పోగుచేసి ఇస్తారా? నా పిల్లలకు తగిన మొగుళ్ళను తేవడానికి. అడ్డమైన వాళ్లను నా పిల్లలు చేసుకుంటారా?

అయినా వీరమ్మా ఆడపిల్లలకంత పెద్ద చదువులెందుకో చెప్పు. తరవాత ఏకిరస్తాని వాణ్ణో చేసికుంటే...

...ఆ...ఆ... నా పిల్లలెప్పుడట్లా చేయరు. నోరుమూసుకోండి అని వీరమ్మ వీరావేశంతో మాట్లాడేది.

మొదట వర్ణించిన సంభాషణ జరిగిన మరునాటి ఉదయం వీరమ్మకు ఉత్తరం వచ్చింది. పట్నంనుంచి లీలమ్మ తన్ను ప్రభుత్వం రెండేండ్లపాటు లెక్చరరుగా పనిచేయడానికి అమెరికా పంపుతున్నదని కుటుంబాన్నికూడ తీసికొని వెళ్ల వచ్చునని తక్షణమే ప్రయాణ సన్నాహాలు ఏర్పాటు చేసుకోవాలని, జాబు చూచినట్లుగానే బయలుదేరి రమ్మని వ్రాసింది. వీరమ్మ ఆ రోజంతా అన్నం వండుకోలేదు. పాలు పెరుగు తాగి, రెండు చెవులమధ్యతలగల ప్రతివారితో మా అమ్మాయి అమెరికా వెళ్తుంది, అని చాటి చెప్పింది. ఇక మాటామున్లై సర్ద

కొని ప్రయాణమై ఒంటెద్దు బండెక్కి రైలు స్టేషనుకు వెళ్ళబోయే సరికి కర్ర ఊత బాడుచుకుంటూ సుబ్బక్క వచ్చి "వీరమ్మా! అమ్మాయి విమానంలో వెళ్తుందేమో జాగ్రత్త తల్లీ" అంది.

అంతవరకు సంతోషంతో ఉబ్బా తలుగతున్న వీరమ్మ హృదయంలో నానా కాలం మేఘాలు క్రమ్ముకున్నాయి. అయ్యో ఈ వెధవ ఉద్యోగం వద్దని చెప్తాను. ఎన్ని సముద్రాలు దాటాలి. మాయ విమానాన్ని నమ్మి నా పిల్లను పంపుతానా? రెండేండ్ల నుండి నెలకు మూడు వందలు సంపాయించే బంగారు తల్లిని; ఎంత చదువుకున్నా అమ్మ అంటే నా తల్లికి ఎంత ప్రేమ—మొన్న ఆ మధ్య సాహితీ సమావేశంలో తన కూతురు మాట్లాడడం అందరు చప్పట్లు తట్టడం వీరమ్మ మనస్సులో మెరిసింది.

చీకటి పడేసరికల్లా వీరమ్మ చెన్నపట్నంలో ఇల్లుచేరుకుంది. అప్పటికే లీలమ్మ పాసుపోర్టు విషయమైన ఏర్పాట్లలో లీనమై ఉంది ఇంట్లో అడుగు పెట్టిన వీరమ్మ కూతుర్ని కౌగలించుకొని ఒక్క ఏడుపు ఏడ్చింది. "తల్లీ! వద్దమ్మా ఈ నౌకరి. కనుపూరికి వచ్చి బడి పెట్టావంటే చాలు; కళ్ళద్దుకుంటారు. ఉన్న ఊరు మన్న ప్రజ ఏమీ చదువుకొని రామచంద్రుడున్నాడే - వాడికే నెలకు అరవై డెబ్భై గిట్టుతున్నాయి. రైతులనంతా కూడగట్టి హైస్కూలు పెట్టిస్తాను. నీకు ఏమి కొఱత ఉండదు" అని కంటికి కడివెడుగా వెచ్చని కన్నీరు కార్చివేసింది.

—నీకేమైన పిచ్చి పట్టిందా! ఎంతో సంతోషిస్తావనుకుంటే ఏడుస్తున్నావు అక్కడ నాకెంత జీతం తెలుసా నీకు నెలకు ఐదువందలు పంపవచ్చు. క్రొత్త దేశం చూడడం కొత్త విషయాలు తెలుసుకోడం. పోమ్మా! నేనిప్పుడు వెళ్ళనంటే స్త్రీ జాతికే—తలవంపులు, అక్కడ మాత్రం మనలాంటి మనష్యులే కదా ఉండేది. పైగా నేను అధ్యాపికను. ఎంతో మర్యాదగా మనదేశం పట్ల ఉండే గౌరవమంతా ప్రదర్శిస్తారు. నీవేమన్నా సరే ఈ విషయంలో మాత్రం నీవు ఒప్పుకునే తీరాలి- అన్నది లీల. అయ్యో పెళ్లయినా కాకపోయే అసలు మొగుడు సంసారం అంటూ ఉంటే నీవు వెళ్ళడానికి సాహసిస్తావా-నీ కుటుంబానికికూడ రాకపోకలు యేర్పాటు చేస్తారన్నావు కదా ఎవరిని తీసికొని వెళ్దామని నీ ఉద్దేశం.

బాగుందమ్మా నీవరస. వీలైతే నిన్ను తీసికొని వెళ్లవచ్చు. సునీతి ఎలాగు మేజరు, పైగా దానికోర్సు పూర్తికావాలాయె. వస్తావా మరి వెళ్దాము అని ఎలాగు అమ్మ రానంటుందన్న ధైర్యంతో లీల అన్నది.

నిన్ను ఒంటరిగా వెళ్ళనిస్తానా? నా గొంతులో ఊపిరుంటే; నూరు అరు గాని ఆరునూరు గాని నేను నీతో రావడం నిశ్చయం నీవే వెళ్లడం గనక ఖాయం అయితే.

ఖాయం ఏమిటి ఏదో తారీఖులో గా అక్కడ ఉండాలంటే సరే నీకుకూడ ప్యాసుపోర్టుకు అర్జీ పెట్టాను. మరి ఇన్ని సముద్రాలు దాటి అంతదూరము రాగలవా అమ్మా! అన్నది మళ్ళీ లీల ప్రశ్నార్థకంగా.

మొన్న పుట్టిన నీవు గొప్పదానివై వెళ్ళితే నేను రాలేనేమిటి? అక్కడ వాళ్ళకు మాత్రము తల్లీ తోడునీడా, ఉండరా?

సరే నీవు పోట్లాడవద్దు నేను వెళ్లడం ఖాయం నీవు నాతో రావడం ఖాయం అని లీలమ్మ అన్న తర్వాతే వీరమ్మ మాటలో వలపెట్టి కాళ్ళు కడుక్కొని వంట ఇంటివైపు వెళ్లింది.

ఏం చదువుకున్న వారి కాపరాలో, ఎక్కడివక్కడ, ఇద్దరికీ ఈ పాటికి పెళ్ళయితే నలుగురు పిల్లలుండే ఈడు. అని సణుగుకుంటూ అన్నీ కడగడం ఇల్లు చిమ్మడం మొదలు పెట్టింది వీరమ్మ.

లీలా! సునీతి ఏదే? అన్నది వీరమ్మ కుంపటికడిగి నిప్పు రాజేస్తూ.

ఏమో అది ఈ మధ్య ఆలస్యంగా వస్తోంది. హాస్టలులో ఉంటే రాకపోకల బాధ తప్పుతుంది అని అంటున్నది. ఎలాగు పైవారం మనం వెళ్ళేపట్ల హాస్టలులో ప్రవేశించవలసిందే కదా?

నీకు సరే మప్పెదావుకున్నాయి. సునీతైనా పెండ్లిచేసికొని ఒక ఇంటిదవుతుందో లేదో.

ఏమిటమ్మా ఏదో విపరీతం జరిగినట్లున్నదే. నీవేనా? మాట్లాడేది, పెళ్ళంటే ఎగిరిపడే దానివి సునీతికి పెళ్ళంటూ మొదలు పెట్టావు.

ఏమోనమ్మా! పూర్వము అనుకున్నది నిజమే పెళ్ళివల్ల సుఖమేమని. కాని నీవిలా ఒంటరి బ్రతుకు బ్రతకడం కూడ నాకేమంత బాగులేదు తృప్తికరంగా లేదు.

సరే, కాని నీకు కావలసిన కోట్లు, అవి కొనాలి పైగా మనం చలికాలం ముందర పెట్టుకొని వెళ్తున్నాము రేపు బజారుకు వెళ్ళాలి ఏం అన్నది లీల.

అమ్మాయి ఈ పచ్చడి నూరు, నాకేమో రొప్పు వస్తుందన్నది అని, చీర చెరగు పరచుకొని వీరమ్మ పడుకున్నది. లీలకు అమ్మ స్వభావం తెలుసు. తాను కట్టుకున్న చీర విడిచి దండెము మీది మడి చీర కట్టుకొని పచ్చడి నూరి వది కుంపటిమీదిఅన్నంఇగిరినది. అమ్మ అలసి ఉన్నందున నిద్ర పట్టినట్లున్నదని ఆమెను మెల్లగా లేపినది. ఇద్దరు కలిసి భోంచేసారు. సునీతి వచ్చింది ఇంతలో, "వచ్చిందటగా అమ్మ, అమ్మా!" అంటూ గెంతుతూ.

అమ్మ కూడ నాతో వస్తుంది తెలుసా? అన్నది లీల.

నిజమా అమ్మా! నేను సెలవులకు

"ఎక్కడికి వెళ్ళేదమ్మా నీవు కూడ వెళ్తే" అన్నది సునీతి ఏడుపు మొహం పెట్టి.

బంగారు తల్లివి కదూ పెద్దక్కయ్య దగ్గరకు వెళ్ళోగాని నేనక్కడ కురుక్షేత్రంగా ఉంటానా-అక్కను ఒంటరిగా ఎలా పంపేది చెప్పు అంటూ అన్నము మరింత నెయ్యివేసి ముద్దలు కలిపి పెట్టుతూ సునీతి వైపే పరీక్షగా చూచింది వీరమ్మ.

లీల కన్న సునీతి అందగత్తె. కాస్త కళ్ళకు తగిలే జడ రంగు కూడ మేలే. ఏమో తల్లి, నువ్వు జాగ్రత్తగా చూసుకో అక్కలాగా నీవు కూడ...

ఏం నిత్య కన్యగా ఉండమంటావా? ప్రేమించడం ప్రేమించబడడం మానవ స్వభావం నాకు నచ్చిన వ్యక్తికి నా సర్వస్వం త్యాగం చేస్తాను. ప్రేమ జీవితం గడుపుతాను.

ఏమిటే ఈ ధోరణి నేర్చుకున్నావని. జాగ్రత్తగా ఉండమన్నానంటే అంది వీరమ్మ కండ్లు పెద్దవిచేసి.

నేను మాత్రం ఏమి అన్నానేమి - ప్రేమించలేని జీవితం వ్యర్థమన్నాను. అంతే.

లీల మాట్లాడలేదు. సునీతి మాటలు ఆమెలో ఏదో కదిపినట్లయినది. నిజమే వయసులో చిన్నదైన సునీతి ఏదో సత్యాన్ని ఉద్ఘోషిస్తున్నట్లనిపించింది.

అమ్మా నాకేమో నిద్ర వస్తుంది. వెళ్తున్నానని చెప్పి మంచముమీద పడుకొనింది. కాని నిజంగా నిద్రవస్తేగా, నాలుగేండ్లనాడు తాను రాజధాని కళాశాలలో ఎం. ఏ. చదువుతున్నప్పుడు "మాక్ పార్లమెంటు"లో తనతోపాటు మాట్లాడిన సుబ్రహ్మణ్యం చాల తెలివైన వాడనిపించింది. అతడు గణితములో ఎం. ఏ చేస్తున్నట్లు తెలుసుకున్నది. ఎలాగైనా అతనితో మాట్లాడవలెననిపించింది. కాని తన సహాధ్యాయిని శారద అన్నది కదా-ఆ అబ్బాయి ఎవరో తెలుసా మా ఊరి చాకలివాళ్ళ అబ్బాయి. వాళ్ళ అన్నయ్య గుంటూరిలో లాండ్రీ పెట్టుకున్నాడు. ఇతడు షెడ్యూల్ కాస్ట్ స్కాలర్‌షిప్పుల ధర్మాన ఇంతవరకు వచ్చాడు. చిన్నాయనలు మేనమామలు ఇంకా రేవులో, మురికిబట్టలు ఉతుకుతూనే ఉన్నారు" అని.

శారద మాటలు లీలకు నచ్చలేదు. "అతడెవరైతే మనకేమి చాల తెలివైన వాడట. చూచావా ఎలామాట్లాడాడో, వాళ్ల క్లాసుమేటు ఒక అమ్మాయి కామన్‌రూంలో అంటుంటే విన్నాను-యూనివర్సిటీ ఫస్టు-గాకూడ రావచ్చునట.

కావచ్చు, నేను కాదన్నానా చాకలి కుర్రవాడని అని మాత్రమే అన్నాను. అప్పటితో ఆ సంభాషణ ఆగిపోయి నా లీల రెండు మూడుసందర్భాలలో సుబ్రహ్మణ్యంతో పరిచయం కలిగించుకోవ ప్రయత్నించింది. కాని, ఆమెకు ఇతరులు ఏమి అనుకుంటారో అన్న భయం మిక్కిలి కాగా ఆ ప్రయత్నంనుంచి మానివేసింది. కాని అతన్ని గూర్చి తెలుసుకోవాలన్న ఆతురత ఆమెలో ప్రబలింది. శారదనే కదిపి ఇంకా కొన్ని విశేషాలు తెలిసికొందామని అనుకుంది. శారద గొప్ప ఇంటి పిల్ల. కొంచెము సోమరి. క్లాసులో నోట్సు వ్రాయదు ఎవరైన తర్వాత వ్రాసిపెట్తే సంతోషిస్తుంది. డబ్బు ఆమెకు లెక్కలేదు. పైగా ఆమె వివాహిత, 'నాకు క్లాసుతో పనిలేదోయ్. మావారు 'నా భార్యకూడ ఎం. ఏ. చదువుకున్నదని చెప్పకోడానికి నా పేరు ప్రక్కన ఆ రెండు అక్షరాలు వేసుకోడానికే" అంటుంటేది.

లీల ఆ రోజు శారదకు ఇష్టముగా ఉన్న పన్నులన్ని చేసింది. ఆమెకు కావలసిన పుస్తకాలు వెదకి (లైబ్రరీ నుంచి) తెచ్చి ఇచ్చింది. నోట్సు వ్రాసి పెట్తానన్నది.

"శారదా! అయినా సుబ్రహ్మణ్యంకు ఎన్నేళ్ళుంటాయి" లీల ఇలా అడగడం శారదకాశ్చర్యం వేసింది.

ఇరవై ఏడు ఇరవై ఎనిమిది ఉండవచ్చు. ఆలస్యంగా బళ్లో చేర్చారు. కానితర్వాత ఆగకుండా పైకివచ్చాడు. ఆ కుర్రవాడు చాల అభిమానోయ్. ఒకసారి నేను డబ్బు ఇస్తానంటే పుచ్చుకోలేదు. అతనికి స్కాలర్‌షిప్ప ఇంకా గ్రాంట్ కాలేదని పస్తులు మాడుతున్నాడని అతని రూమ్‌మేటు మావారి అక్కకొడుకు అన్నాడు నేను పోనీలేపాపం ఇద్దామనుకున్నాను అప్పగానే సుమో-సనేమిరా అని పుచ్చుకోలేదు.

లీలకు అంతకుపైన అడగడానికి ధైర్యంలేదు. పబ్లిక్ పరీక్షలు దగ్గరకు వచ్చేసరికి చివరి సంవత్సరం విద్యార్థులు టీపార్టీ ఇవ్వడం ప్రతికాలేజిలో పరిపాటే కదా! ప్రెసిడెంట్ కళాశాలలో ప్రత్యేకంగా ప్రతి డిపార్టుమెంటులోనూ, తర్వాత సమిష్టిగాను చివరి సంవత్సరం విద్యార్థులకొందరికి పార్టీ ఇవ్వడం అలవాటు.

లీలకు వెళ్లాలని లేకపోయినా మళ్లా ఆ కళాశాలలో తిరగడం ఇంక ఎప్పుడో గదా! అని వెళ్లింది. ఆమె మామూలు దుస్తులలోనే వెళ్ళింది. కొంచెము ఆలస్యంగా వెళ్ళడంవల్ల ఆమెతోపాటు చదువుతున్న ఫిలాసఫీ విభాగపు విద్యార్థులంతా కూర్చొన్న చోట కుర్చీలు నిండినవి. ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ కూర్చుందామని ఆమె అటు ఇటు చూచినది. కొంచెము దూరంలో నిలబడివున్న సుబ్రహ్మణ్యం - ఇక్కడ ఖాళీ ఉన్నది రండి, రండి అని పిలవడం వినిపించింది. ఏదో విద్యుచ్ఛక్తి ఆకర్షించినట్లు ఆమె అక్కడకు వెళ్ళినది. ఒక్కటే కుర్చీ ఖాళీగా ఉన్నది. సుబ్రహ్మణ్యం తన సహాధ్యాయులకు "ఈమె ఫిలాసఫీవిభాగంలోని విద్యార్థిని నా స్నేహితురాలని పరిచేయం చేసాడు. ఫిలాసఫీకి గణిత శాస్త్రమునకు విరోధం లేదనుకుంటాను అని సుబ్రహ్మణ్యం ఆ సేసరికి

తన్నే అనుకుని లీల లేదు-లేదు, అన్నది అందరు కలసి నవ్వారు. సిగ్గంటే ఏమో యెఱుగని లీలను సిగ్గు ముంచివేసింది. మొహం కందిపోయింది.

సుబ్రహ్మణ్యం "ఆహార వ్యవహార విషయాలలో బిడియం పనికిరాదండి" అంటూ సర్వర్‌ను పిలిచి కాఫీ ఇంకో కప్పు తెమ్మన్నాడు. కిమ్మనకుండా లీల అల్పాహారం సేవించి కాఫీ పుచ్చుకుంది.

పార్టీ పూర్తి కాగానే 'ఎన్‌టర్ టైన్‌మెంటు' ఏర్పాట్లు చేస్తున్నారు.

సుబ్రహ్మణ్యం అన్నాడు—"మీకు అడ్డంకి లేకుంటే అలా వెళ్ళి వద్దాము కుర్చీలు సరిగా వేసేసరికి రావచ్చు"

ఎక్కడికి? దేనికి? అని అడగడానికి లీలకు సాహసంచాలలేదు. మౌనంగా అతన్ని అనుసరించింది.

ఇద్దరు కలిసి కాలేజి ముందు భాగానికి వెళ్ళి అక్కడ ఉండే ఒక బల్లమీద కూర్చొన్నారు.

"చదువు అయిపోయింది కదా! ఏం చేస్తారు?" అన్నాడు సుబ్రహ్మణ్యం

"మీరేం చేస్తారో నేను అదే చేస్తాను" అన్నది లీల అనాలోచితంగా.

"నాతో మీకేం పోటీ నేను మగవాణ్ణి ఉద్యోగం చేస్తాను. మీరు స్త్రీలు వివాహం చేసుకోవాలి."

"బాగుంది మీ ఉపదేశం. మగవాళ్ళే ఉద్యోగాలు చేయాలి. ఆడవాళ్లు పెళ్ళి చేసికొని వాళ్లకు దాసీలు కావాలి అంతేనా?"

"దాసీలు కాకుండా పురుషులను దాసులను చేసికోవడమే పెళ్లి సిద్ధాంతము."

"మీరు గణిత శాస్త్రజ్ఞులు సిద్ధాంతాలు చేసే అధికారం మీకు లేదు. అది మాదే వేదాంతులది." అన్నది లీల తడుము కోకుండా. సరేలెండి మీ వాక్కును నేను కాదనను. స్త్రీలు పెండ్లిచేసుకోవడం ధర్మం అన్నాను.

పురుషులకు కూడ - ముప్పై యేండ్లు దాటితే స్త్రీకి పెండ్లి చేసుకునే అధికారం లేదు.

ఇది మీ నూతన సిద్ధాంతమా-మీకు ముప్పైయేండ్లు దాటడానికి చాలకాలం పట్టుందనుకుంటాను.

అట్టే కాలంలేదు మూడేండ్లే.

నాకంటే మీరు రెండేండ్లు చిన్నవారు. మీరు కమ్మవారా?

కాదు అగ్రజన్ములము.

నేను అలా అనుకోలేదు.

నేనుకూడ అభిలషించడంలేదు. ఏం కులంలో పుట్టాలో అది మన చేతిలో ఉన్నదా? కర్మ చండాలునికన్నా గుణ చండాలుడు శ్రేష్ఠుడని నా దృఢ నమ్మకము.

నిజంగా నా అవసరమైతే ఈ నమ్మకాన్ని కార్యరూపంలో పెట్టగలరా?

ఏమో-టైమయింది. తర్వాత కుర్చీలు నిండిపోతాయి. ఇందాకైతే మీరు నాకు సాయపడ్డారు. ఇప్పుడు ఇద్దరికి ఎవ్వరు సాయపడతారు?

'భగవంతుడు - అన్నాడు సుబ్రహ్మణ్యం పరీక్షగా ఆమెను చూస్తూ అతడు తన్నలా చూడడం లీలకు బాగు లేనట్లున్నది. కాని హాయిగా ఉన్నది.

మౌనంగా ఇద్దరు 'ఎన్‌టర్‌టయిన్‌మెంటు' మైదానానికి వచ్చారు. శారద కనిపించగానే లీల పారిపోయినది. వెళ్తున్నామని చెప్పకుండా నేవచ్చేశామే అని తర్వాత సాలిక కరచుకున్నది లీల. శారద పార్టీకి రాలేదేమన్నది. లీల జవాబు చెప్పకుండ తప్పుకుంది. ఆరోజు రాత్రంతా లీలకు ఎంతో హాయిగా ఉన్నది. సుబ్రహ్మణ్యం అన్న మాటలు ఆమె చెవుల్లో ప్రతిధ్వనించసాగాయి.

తర్వాత ఆమె అతన్ని కసులుకో లేదు. అతని చిరునామాకూడ ఆమెకు తెలియదు. నాలుగేండ్ల కాలప్రవాహంలో కొంత మరచిపోయినా సునీతి 'అక్కకు ప్రేమించే ఔదార్యములేదన గానే ఈ సన్నివేశము ఆమె మనోవీధిలో మెఱసింది. ఆనాటి మధురస్మృతులన్ని ఇంద్ర ధనస్సువలె వివిధమైన మనోహరమైన రంగులలో ఆమె హృదయమనే నీలిమాకాశంలో మెరిసాయి. పిచ్చి సునీతి! నీకు తెలిసిందంట్లే? ఒకనాడు అక్కయ్య బావగారితో ప్రత్యక్షమైతే ఏమంటావో అని అనుకొని తనలో తానే నవ్వుకుంది లీల.

◆ ◆ ✱

అమెరికా వెళ్ళే ఏర్పాట్లన్ని బాణ వేగంతో జరిగిపోయాయి. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో భారతీయ వేదాంతానికి ఉపన్యాసకురాలుగా, ఆంధ్ర వనిత 'లీలావతి' వెళ్తున్నదని పత్రికలు మార్మోగాయి చదువుకోడానికి వందలాది భారతీయులు విదేశాలకు వెళ్ళడం గత శతాబ్ది నుండి పరిపాటే. అయినా అధ్యాపకురాలిగా ఒక స్త్రీ, దక్షిణ భారతీయ స్త్రీ వెళ్ళిందంటే నగుకగులకు కొంచెమైన ఆశ్చర్యం కలిగింది. ఆమెతో కూడ వీరమ్మగారు కూడ వెళ్లడం ఆశ్చర్యంలో ఆశ్చర్యం.

వీరమ్మ లీలావతి బొంబాయి వరకు మాయ విమానం ఎక్కకుండ, రైలు మార్గాన్నే వచ్చారు. బొంబాయిలో విమానం ఎక్కేటప్పుడు వీరమ్మకు ఏదో జన్మ భూమికి వీడ్కోలిస్తున్నట్లనిపించింది. కండ్ల నిండా నీరు నిండుకున్నాయి. "నా సునీతిని జాగ్రత్తగా చూచుకో ఏడు కొండలవాడా!" అని కొంచెము పెద్దగానే అన్నది. "అమ్మా భయపడవద్దమ్మా! ఏం లేదమ్మా బస్సులో కూర్చున్నట్లే ఉంటుంది." అని ఏదో అనుభవ పరురాలివలె చెప్పింది కాని ఈ విమానం కూలితే...అన్న భయం లీలకు లీలగా ఉండనే ఉన్నది. విమానం అరేబియా సముద్రం మీదుగా ఎగురుతున్నది. విమానం చాలా పెద్దది "అమ్మాయీ! ఇది మన పూర్వులు వాడిన పుష్పక విమానమే సుమా!" లీలకు నవ్వు వచ్చినది.

"మాయ విమానాలు మనష్యుల ప్రాణులే బలితీసుకుంటాయి. ఇది పుష్పకం శ్రీరామచంద్రుడు ప్రయాణం

చేసింది. అది కుబేరుడి దగ్గర ఉంటే రావణాసురుడు బలవంతాన తీసుకున్నాడు. తర్వాత రాముడికది లభించింది-మన వాళ్ళది ఒట్టి మట్టి బుర్ర తర్వాత విమానాలు ఎలా చేయడమో మరిచిపోయారు. కాని దాని వర్ణన అంతా ఎలా చేయాలో అంతా-సంస్కృత గ్రంథాలలో ఉందని మా నాయన చెప్పేవాడు, తర్వాత జర్మనీ వాడు సంస్కృతం నేర్చుకొని మొదట విమానం చేసాడు. తర్వాత అందరు యూరోపీయను దొరలు నేర్చుకున్నారే అమ్మా! ఇది సరియైన పుష్పకం లాగా కుదిరింది. చూడు ఒక్కొక్కసారి వంటకం కుదిరినట్లు ఇంకొకప్పుడు కుదరదు. ఆ కాలపు పుష్పకానికి నమూనా ఇది అన్నది వీరమ్మ.

వ్యతిరేకించి ఆమెకు బాధ కలిగించడం ఇష్టంలేనందున లీల ఊరుకున్నది. విమానంలో మొదట పడిపోతామేమోనని 'బెల్టు' కట్టుకుని అతి జాగ్రత్తగా కూర్చున్నది వీరమ్మ. అమ్మాయి! గట్టిగా కట్టుకో అని కూతుర్ని హెచ్చరించింది. కిటికీ ప్రక్కగా కూర్చున్నందున సముద్రం బాగా కనిపించింది: అమ్మాయీ! సప్తసాగరాలు దాటుతామా? అన్నది వీరమ్మ.

“ఆఁ” అన్నది నవ్వుతూ లీల.

కూర్చున్నచోటికే కాఫీ బిస్కత్తులు, భోజనం తెచ్చిపెట్టిన, 'ఎర్ హోస్టెస్'ను చూచి 'అమ్మాయీ! ఈ పిల్ల ఎవరు?' అన్నది. ఆ పిల్ల పేరునుబట్టి తనకు మహమ్మదీయవనిత అని తెలిసినా లీల తల్లి తురక నీళ్లు త్రాగదని తెలుసు కనుక 'యూరోపియన్ దొరసాని' అన్నది.

“నిజమా! ఇండియాకు వచ్చేసరికి వాళ్ళ వెంట్రుకలు నల్లబడతాయా!” అన్నది వీరమ్మ.

ఆ పిల్ల తలకు రంగు పూసుకున్నది బాగా తెలుస్తూనే ఉన్నది. లీల మెదలకుండా ఏదో పుస్తకాన్ని తిరగేస్తూ కూర్చుంది. అమ్మాయి 'అల్పాచమనానికి' వెళ్లాలే అన్నది వీరమ్మ. లీల బాత్‌రూంను చూపమని ఏర్‌హోస్టెస్‌కు చెప్పినా లోపల చిక్కుపడుతుందన్న బాధతో తానుగూడ వెళ్ళి కొళాయి ఎలా తిప్పాలో, వేడినీళ్ళు ఎక్కడవస్తాయో మళ్లా ఎలా శుభ్రపడుతుందో అన్ని అంగ్లములో వ్రాసియున్న సూచనలను చూచి చెప్పింది.

వీరమ్మ “సరే నీవు వెళ్ళు” అన్నది. అక్కడ కూర్చుని ఎంత చక్కగా కొద్ది చోట్లో అంతా ఇమిడ్చారో చూచి ముక్కుమీద వేలెట్టుకుంది. అక్కడి సబ్బు తీసుకుని మొఖము రుద్దుకొని ఏముంటుందో అని పౌడరు డబ్బి తెరిచే వాసన గుభాలించే పౌడరు. ఏమిటే సున్నపు పూతలు అని పిల్లలను కసురుకొనే వీరమ్మకు ఆ పౌడరు కొంచెము పూసుకోవాలనిపించింది. దువ్వెర, హేర్ ఆయిలుసీసా కనిపించాయి తల్లదువ్వి ముడివేసింది తనకు వయసులో పదిపదిహేనేండ్లు తగ్గిపోయినట్లు ఒక వింత భావన కలిగింది.

“అదృష్టం లేనివాడు 45 ఏండ్లకే చచ్చి ఊరుకున్నా”డని ఏనాడో గతించిన భర్తను తలచుకొని రెండు కన్నీటి బిందువులు కార్చింది. లీల అన్నీ చూపింది గాని మళ్లా ఎలా తలుపు తెరవాలో చూడలేదు. వీరమ్మ లాగిలాగి చూసింది. ఐదు నిమిషాలు ప్రయత్నించి లీలమ్మా! అని కేక వేసింది. ఏర్‌హోస్టస్ వచ్చి తలుపు తెరిచింది. “ఇంగ్లీషులో వ్రాసి ఉందే” అనింది లీలమ్మ! “నాకా రెండు ఇంగ్లీషుముక్కలే వచ్చి ఉంటే ఇలాటి విమానాన్ని ఇండియాలోనే తయారు చేయనా?” అన్నది వీరమ్మ.

“అయినా ఇదేం ఖర్మం అంతా ఇంగ్లీషు, హిందీ, నాలుగుకోట్లు జనాభా మాట్లాడే తెలుగు భాషలో ఎందుకు వ్రాయకూడదమ్మా? మొన్న నెల్లూరిలో పెద్ద మీటింగు జరిగింది. మన భాష ఎంత గొప్పదో-తేనెకంటె తియ్యనిదని ఇంగ్లీషు మ్లేచ్ఛభాష అది మొన్న మొన్న పుట్టిందని తెలుగువారు చాల నాగరకంగా, వైభవంగా బ్రతికారని చెప్పాడు. అయన పేరేదో మరిచిపోయాను” అని గుక్క త్రిప్పకుండ, తాను విన్న ఉపన్యాసాన్నంత తుచ తప్పకుండ వల్లించింది వీరమ్మ.

ముందు కూర్చున్న బొంబాయి వర్తకుడు ఏం భాష ఇది పక్షులు కిచకిచలాడినట్లున్నది అన్నాడు.

అతని ప్రక్కన కూర్చున యూరోపి..న్ - ఆంగ్లేయునివలె ఉన్నాడు - “అది తెలీదటయ్యా-ఇటాలియన్ ఆఫ్ ది ఈస్టు - తెలుగు, ఆంధ్రులభాష” అని ఆంగ్లంలో అన్నాడు.

“వీరమ్మ అప్పుడే గ్రహించింది. ఏమిటా బొగ్రదొర అంటున్నాడు?” అంది వర్తకుని చూపి.

ఎక్కడ అనవసరంగా పోట్లాట ప్రారంభమౌతుందోనని మనలను గూర్చి కాదువే అన్నది లీల.

'ఎంత చదువుకున్నా మీ నాన్న పిరికితనం నిన్ను వదిలిందికాదు. నాకే ఆ రెండు ఇంగ్లీషుముక్కలు వచ్చి ఉంటేనా! నీలాంటి వాళ్ళు చదువుకుంటే దేశానికేమి లాభము. తిట్టిపోస్తున్నా విని ఊరుకునే వాళ్లునిండిపోబట్టే మనదేశంలో తిండి కరువౌతుంది' అన్నది వీరమ్మ.

లీలమ్మ “ఇదుగో చూడు చీకటి పడుతున్నది. సముద్రము మీద సాయంకాల సంధ్యా శోభ” అని తల్లి దృష్టి మరలించింది.

అర్ధ రాత్రికి కెయిరో నగరం చేరుకున్నది విమానం. “తురక కొంప గంగతాగను” అని విమానం ఎక్కేవరకు నీళ్ళు మింగలేదు వీరమ్మ. కాఫీ, పాలు. బిస్కత్తులు తప్ప వీరమ్మ ఏం ముట్టుకోలేదు. లండన్‌లో కొంచెము సేపు మళ్ళా విమానం ఆగి మళ్ళా ప్రయాణం చేయసాగింది. లండను విమానాశ్రయంలో దిగి అందరు భోజ

సాలు చేసారు. అహోట వీరమ్మ ఏదో వింతలోకంలో ఉన్నట్లు అనుభూతిని పొందింది "అమ్మాయీ! ఎంత వెలుగు, బలే బాగున్నద"ని అని సంతోషాన్ని వెలిబుచ్చింది. "అమ్మాయీ! ఇలా అడ్డంగా ఎగరకుండ పైకి ఎగిరితే స్వర్గాన్ని చేరుకోమటే – అన్నట్లు నా తెలివి తెల్లవార! ఈ మ్లేచ్ఛదేశం, కాదే మరిచిపోయాను ఇది యవనదేశం కదూ, ఇక్కడ స్వర్గం ఏది అంతా నరక మేట కదూ. కనుపూరిలో కృష్ణయ్య చెప్పేవాడు వీరమ్మా! ఆదేశల్లో నీతి నియమ మంటూ లేదు. ఒక మొగుడు నలుగురు పెళ్ళాలు, ఒక భార్యకు ఐదుగురు మొగుళ్ళుంటారు అని. నిజమేనా అమ్మాయీ?"

"మన ద్రౌపతికి పూర్వముంచేవారు ఇప్పుడెవ్వరికీ లేరు. కృష్ణయ్య కేమి తెలీదు. బ్రాహణార్థం బ్రాహ్మడు. ఏదో రెండు మంత్రాలు ముక్కున బెట్టుకొని పప్పు భప్పరం సంపాయిస్తుంటాడు," చెప్పింది లీల.

"అమ్మాయీ! తప్పే; ఈ విమానం నీ బుద్ధి మార్చి వేసినట్లున్నది. పురోహితుడు దేవుడికి సమానము. చెంపలు వేసుకోమ్మా!" అని వీరమ్మ తాను లెంపలు వేసుకుంది.

విమానం సాయంకాలానికి కాలిఫోర్నియా చేరుకున్నది. విశ్వ విద్యాలయాన్నుంచి ప్రతినిధులు వచ్చి లీలను వీరమ్మను వారికై ప్రత్యేకించబడ్డ భవన భాగానికి తీసికొని వెళ్ళారు. వాళ్ల భాగము 15వ అంతస్థులో ఉండేది. ప్రతిరోజు వీరమ్మ ఇల్లంతా ముగ్గులు పెట్టేది. అమెరికను వనితలు వచ్చి అబ్బ ఎంత బాగున్నవని అనేవారు. ఆమె ఖణింగుమని అధ్యాత్మ రామాయణ కీర్తనలుపాడితే, రికార్డు చేసుకుంటామని ఎందరో వచ్చేవారు.

అమెరికావచ్చి మూడు నెలలైనది. వీరమ్మకు సునీతినిగూర్చి చింత; విచారము. ఏమో పెండ్లికాని పిల్ల ఒంటరిగా విడిచి రావడం తప్పు. లీలకేమి భయం లేదు. ఇంటికి వెళ్లిపోవాలన్న భావము ఉదయమై, వృద్ధిపొంది ప్రబలమైనది.

అమ్మాయి! ఈ తెల్ల మొహాలను చూచుకుంటూ ఇంకా ఎన్నిరోజులుండాలి చెప్పమ్మా! వెళ్లిపోదాం పదమ్మ. అబ్బ మా కనుపూరిలో ఎంత చల్లని గాలి. ఎంతైన మన తెలుగువాళ్ల మొహంలోనే కళ అంతా. అవునటే ఆంధ్రస్త్రీల అందాన్ని చాలమంది వర్ణించారట కదూ!

ఏమో నాకు తెలీదమ్మా!

నీకేం తెలుసు ఏదో రెండు ఇంగ్లీషు కూతలు నేర్చుకుని, డిగ్రీ సంపాయించామని సంతోషపడి కడుపు చేతబట్టకొని కాని దేశానికి వచ్చి...ఏమిటీ వెధవ బతుకు. అయ్యో నాలుగు రోజుల్లో పెద్ద పండగ ఎన్ని సంబరాలు, ఎంత సంతోషము, పాడిపంట, ఇల్లు వాకిలి, మన తనం..ఏమీలేని ఈ అడివిలో నేనుండ లేనమ్మా నీకిష్టమైతే ఉండు" అని కండ్లనీరు పెట్టుకొంది వీరమ్మ.

"నిజం చెప్పమ్మా ఈ దీపాలు, ఈ టెలివిజన్, ఇలాంటి వంట ఇల్లు మన ఊళ్ళో ఉన్నాయా?"-అడిగింది లీల.

వెధవ యంత్రాలు ఎవరికి కావాలి. అంతా ప్రాణానికి ముప్పం అరవై యేళ్ళు బ్రతికాను. ఆ పెన్నానది ప్రవహించిన పుణ్యభూమిలో, తిక్కనకంఠం ప్రతిధ్వనించిన ఆ గాలిలో మూడు వందల అరవై దేవళాలు ఉన్నాయని శ్రీనాధుడు కీర్తించిన ఆ నెల్లూరుగడ్డలో నా తాతముత్తాలు బ్రతికి మరణించిన ఆ మట్టిలో పరిచితమైన నా దాలువింటూ నా ఈదేహాన్ని కలిసిపోనీ.

ఏమిటమ్మా నీవు కవయిత్రివై పోతున్నావు.

కవులకేంటే–కడుపు మండితే కవిత్వం దానంతట అదే పెల్లుబుకుతుంది. అతి సంతోషమైనా, అతి దుఃఖమైనా గుండె ఓర్చుకోలేదు. ఏదో రూపంగా బయట పడవలసిందే.

అమ్మ మాటల్లో సత్యము ప్రతిధ్వనిస్తున్నట్లనిపించింది. లీలకు కాని తాను చేయగలిగిందేముంది. అనుకున్న ప్రకారము రెండేండ్లు పూర్తి కానిదే ఇష్టమున్నా లేకున్నా తాను భారత దేశము మరలలేదు. అమ్మకున్న స్థలాభిమానం తనకు లేదా? తనలో సంస్కారమని పేరు పెట్టుకున్నదేదో వాటిని పూర్తిగా తరిమి వేసిందా?

వీరమ్మ ఆరాత్రి భోం చేయలేదు. ఏడు కొండలవాడా! నన్ను రప్పించుకోవాయనా! చేదుకో తండ్రీ అని— రాత్రంతా కలవరిస్తూనే ఉన్నది.

మర్నాడు వీరమ్మకు ఒళ్లు తెలియని జ్వరము. లీలకు భయం వేసింది, డాక్టరుకు ఫోన్ చేసి రప్పించింది. వచ్చిన వాడు మందేదో ఇచ్చి వయస్సు అరవై అనగానే తెల్లమొగం వేశాడు. తానానాడు విశ్వవిద్యాలయానికి రాలేనని ఫోన్ చేసి అమ్మ ప్రక్కనే కూర్చున్నది లీల.

ఇంతలో ఫోన్ కాల్.

ఎవరో భారతీయుడు తనను వెదుక్కుంటూ విశ్వవిద్యాలయానికి వచ్చినట్లు ఇంటికి రావచ్చునా అని సహాధ్యాపకుడు డేవిడ్ ఫోను చేసారు.

మా అమ్మగారికి బాగులేదు.

ఆయన మీతో మాట్లాడ ఇష్టపడుతున్నాడు వినండి.

నమస్కారమండీ.

సుబ్రహ్మణ్యంగారా.

ఆ ఆశ్చర్యంగా ఉందా నేనిక్కడ చికాగోలోనాలుగు సంవత్సరాల బట్టి ఉన్నాను. నాకు డాక్టరేటు లభించింది, మీరు వచ్చారని పత్రికలను బట్టి తెలుసుకున్నాను అంతాకులాసేనా.

అదేనండిమాఅమ్మగారికి బాగులేదు.

ఆవిడ కూడ వచ్చారా! అయితే అడ్రసు చెప్పండి వస్తున్నాను - లీల అడ్రసు చెప్పగానే సుబ్రహ్మణ్యం టెలిఫోన్ క్రింద పెట్టేశాడు.

* * *

ఒక అరగంటలో సుబ్రహ్మణ్యం లీల

గారి ఇంటికివచ్చాడు. లీల మూర్తీభవించిన శోకదేవతవలె లేచి తలుపు తెరిచింది. సుబ్రహ్మణ్యం చాల మారిపోయాడు. బాగా తెల్లబడ్డాడు. ఏదో కొత్త కళవచ్చినట్లనిపించింది లీలకు

“మా అమ్మ ఏం చేస్తుందో” అని కంట తడిబెట్టింది లీల. ఏదో చిన్న జ్వరానికి ఇలా హడలిపోతే ఎలా? అందుకే ఆడవాళ్ళకు మొగతోడు అవసరమన్నాను.

‘పరసానికి ఇదా సమయమనుకొని లీల మొహం చిట్లించింది. సరేలెండి. డాక్టరిచ్చిన ఈ మందులు కొంచెము కొని తెండి.

నాకు కొంచెము కాఫీయో, ఏదో ఇస్తే వెళ్తాను - నిన్న వెదుక్కుంటూ తెల్లవారి నుంచి తిరిగి, తిరిగి అలసిపోయాను.

లీల స్టౌవ్ వెలిగించి కాఫీ తయారు చేసి, కొన్ని బిస్కత్తులతో సహా తెచ్చి పెట్టి—అన్నట్లు ఎప్పుడు వచ్చావేం అని అడక్కుండా నా గొడవ నెత్తిన వేస్తున్నాను మంచిహోస్టునే కదూ! అన్నది అదోలాగ మొహంపెట్టి.

ఎవరు హోస్టు ఎవరు గెస్టు. నేను గెస్టుగా రాలేదు. సరే మందు పట్టుకొస్తాను అని సుబ్రహ్మణ్యం వెళ్ళాడు. ఒక గంటసేపటికి మళ్ళా తిరిగి వచ్చి—ఆ మందు ధర 10 డాలర్లు. నా దగ్గర ప్రయాణానికి టిక్కట్టు కొన్నందున డబ్బులేదు. అయినా నీలాగా నేను అధ్యాపకుడను కాదుగా. విద్యార్థినేగా”-లీల డబ్బు ఇవ్వని పొరబాటుకు నాలుకకరచుకుని డబ్బిచ్చింది. ‘పాపం, ఇన్నిసార్లు తిప్పుతున్నాడ’ని బాధపడింది.

మందులు తీసికొన్నతర్వాత మర్నాడు వీరమ్మకు కొంచెము మేలుగా ఉన్నది. తెలుగు మాట్లాడే గొంతు వినేసరికే ఆమెకు సగంప్రాణం వచ్చినట్లయినది. ఎవరే మన వాళ్లేనా? బుద్ధిమంతుడుగా ఉన్నాడు.

ఆ మనవాడుకాకున్నా అవుతాడు అన్నది లీల.

అవునమ్మా ఈ దూరదేశంలో మన దేశస్థులంతా మనవాళ్ళే

అది కాదండీ మాదీ-అంటే మా గ్రామం కూడ పూర్వం నెల్లూరి మండలంలోనిదే. ప్రస్తుతం గుంటూరు జిల్లా.

అలాగా.

నేను పై ఆదివారం దేశం వెళ్తున్నానండీ మిమ్మల్లను తీసికొని వెళ్లమని లీల అని (జోడు కరిచికొని) పెదిమ కొరుక్కొని లీలమ్మగారు చెప్తున్నారు. వస్తారా.

నిజంగానా నాయనా, అయితే లీలను వదలి ఎలా వచ్చేది.

మీకేమిభయపడకండి నాకీ ఊళ్లోనే ఉద్యోగం అయింది. ఇంట్లో అందరిని ఒకసారి చూచి వద్దామని వెళ్తున్నాను. ఒకనెల రోజుల్లో వచ్చేయాలి.

పెళ్ళయిందా నాయనా నీకు.

లేదండీ

ఎన్నేళ్లు.

ముప్పై మూడు.

బ్రాహ్మలేనా ఈ ప్రశ్నకు సుబ్రహ్మణ్యం జవాబు చెప్పలేదు లీల “అవును” అన్నది వీరమ్మ ముఖంలో వెలుగు మెరసినది.

“అమ్మాయి ఇలా రా” అనింది. “అబ్బాయి నీ చెయ్యి ఇలా ఇయ్యి” అని ఇద్దరి చేతులు కలిపి - నాకింకేమి రోగంలేదు. అమ్మాయి వేన్నీళ్లు స్నానం చేసి వంట చేస్తాను. కూరలు పట్టుకొని రావే వీరెందుకండీ, నేను తెస్తాను లెండి రెండు మూడు రోజులు మీరు లేవకూడదు.

ఎవడు చెపాడు ఆ తెల్ల మొహం డాక్టరేనా? వాడికేం తెలుసు నాకేం జబ్బులేదు. దిగులే జబ్బు దిగులు తీరిపోయింది జాడ్యము కుదిరిపోయింది.

అమ్మాయి కొంచెము కాఫీ ఇవ్వవే- లీల కాఫీ తేవడానికి వంటింట్లోకి వెళ్లింది. సుబ్రహ్మణ్యం ఎదురు చూడని ఈ సంఘటనకు తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.

“నాకప్పుడే తెలుసు ఏడు కొండలవాడేదో దారి చూపిస్తాడని నాయన! నీ పేరిమిటో తెలియదు. కట్నం కానుక లేవి లేవని దిగులు పడవాక నాకు ఆరెకరాల పొలం ఉంది. ఇంకో పిల్లే ఉందేది. మీకేమి అన్యాయంచేయను. నా పిల్ల బంగారంవంటిది వెలలేని మాణిక్యం.”

సుబ్రహ్మణ్యం లోలోన ముసి ముసి నవ్వులు నవ్వుకున్నాడు. ఎలాగో ఆ రోజు లీలా సుబ్రహ్మణ్యములు బలవంతాన వీరమ్మను విశ్రాంతిగా పడకలో ఉంచారు.

మర్నాడే ఆమె లేచి తిరగడం మొదలు పెట్టింది.

నిజానికి సుబ్రహ్మణ్యానికి ఉద్యోగం కాలేదు. అందువల్ల మళ్ళా రావడానికి అవకాశమేలేదు. అందువల్ల వాళ్ళు ఆ మూడవరోజున రిజిష్టరు వివాహం చేసుకున్నారు. ఆమె భర్తగా అతడు మళ్లా రావచ్చు గనుక. లీలతోటి పని చేసే అధ్యాపకులు ఆనందించారు.

ఆదివారం వచ్చింది వీరమ్మ మళ్లీ ప్రయాణమైనది. నాయనా సుబ్రహ్మణ్యం ఇలారా అని పిలిచి 200 డాలర్లు ఇచ్చి, “మావూళ్లో కాంతమ్మకు, రంగమ్మకు, సుబ్బక్కకు, కృష్టయ్యకు అందరికీ బహుమతులియ్యాలి కాని-అమెరికాలో ప్రసిద్ధమైనవేమైన ఉంటే కొనుక్కురమ్మ”నింది.

ఏం తెమ్మంటారు.

“దంతం వస్తువులుంటే తే.”

ఇక్కడెక్కడివండి-మనదేశంనుంచీ ఇక్కడికి వస్తాయి.

వెధవకొంప ఏమీలేవు. ఏవో పరుగులు కుంకలు ఏం చేస్తున్నారో-వెండి వస్తువులేమైనా ఉంటే తే.

అవన్నీ చాల ప్రియమండీ మన చోటే నయం.

ఇంకేం, ఈ దేశాన్ని గూర్చిగూడ అనుకోను అడివికొంప.

లీల బదులు చెప్పవద్దని సంజ్ఞ చేసింది.

ఏమో కొన్ని సిల్కుగుడ్డలు - అవి కూడ-చాల ధరపెట్టి తెచ్చాడు సుబ్రహ్మణ్యం.

మళ్ళా విమానం ఎక్కింది వీరమ్మ- ఈసారి చాల ధైర్యంగా విజయం పొందిన వీరవనితలాగా మిల్లెక్కి- అమ్మాయి వెళ్లివస్తానే జాగ్రత్తగా ఉండవే అని లోపలికి వెళ్ళినది. సుబ్రహ్మణ్యం ఆమెకు కిటికీ ప్రక్కసీటు ఇచ్చి తాను ఇవతల కూర్చున్నాడు.

విమానం బయలుదేరింది. 'అబ్బాయి! ఇదికూడ పుష్పక మేనా?

సుబ్రహ్మణ్యానికేమి బదులు చెప్పాలో తెలియక ఊరుకున్నాడు.

అబ్బాయి నీవేం ప్రొఫసరువి.

లెక్కలు.

తెలుగు పద్యాలేవైనా వచ్చా.

చిన్నప్పుడు నేర్చుకొన్నవి మరిచి పోయాను.

మా లీలకు తగిన వాడివే—లెక్కలు కూడ ఇంగ్లీషులోనే ఉంటుందా?

ఆఁ.

* * *

విమానం బొంబాయి చేరింది. సుబ్రమ్మణ్యం వీరమ్మగారిని మద్రాసులో వదిలిపెట్టి స్వగ్రామం వెళ్ళాడు వీరమ్మను చూచి సునీతి వాడలిపోయింది. ఈ మూడు నెల్లనుంచి కాలేజికి వెళ్లడమే లేదు. "ఏమిటే చిక్కిత్రుణమైనావు?" నోటమాట రాలేదు.

వీరమ్మ పుష్పక విమానాన్ని గూర్చి అడిగినవారి కల్లా చెప్పి లీలమ్మకు పెండ్లయిన విషయం గూడ చెప్పింది.

మూడోనాడు సునీతు! కాలేజి వెళ్లవక్కరలేదా అని నిలదీసి అడిగింది.

సునీతి అమ్మను కౌగలించుకొని నన్ను క్షమిస్తానంటే చెప్తానంది.

"ఏదో చెప్పే అమ్మా! ఏం కొంప మునిగిందే?" అని ఆతురత అంతా కనబరచింది వీరమ్మ.

మా క్లాసు మేటు లలిత అన్నయ్యను రిజిష్టరు మేరేజి చేసుకున్నాను.

ఎర్రమిల్లి లలితేనా.

ఆఁ!

అయితే ఫరవాలేదు మనవాళ్లే నియ్యోగులు. కాని ఆటువేలు. పోనీలే.

అల్లుడేమి చేస్తున్నాడేమి.

ప్రెసిడెంసీ కాలేజిలో తెలుగు లెక్చరరు

తెలుగు లెక్చరరా - నిజంగానా - పద్యాలు చక్కగా చదువుతాడా,

చదవడమేమిటి తెలుగు వాఙ్మయమంతా అరచేతిఉసిరికాయ గేయాలు పద్యాలు వ్రాస్తాడు.

నా కడుపులో పాలు పోసావే తల్లీ ఏ లెక్కలో వేదాంతమో కాకుండా.

◆ ◆ ◆

మర్నాడు పసుపుకుంకుమ. పూలుపండ్లు కొబ్బరికాయలతో లలిత గారింటికి వెళ్లింది.

లలిత—'వీరమ్మ గారూ! ఎప్పుడొచ్చారండీ" అని అడిగింది.

"నిన్ననే అమ్మా—గురుబలంవస్తే అగదంటారు. నేనులేకున్నా మీఅన్నయ్య" అని అనేసరికి లలిత వీరమ్మ నోరు మూసింది.

"మా అమ్మకు తెలియదు" అని చెవులో చెప్పింది.

సరే అని సర్దుకొని వీరమ్మ-ఏమండి మహాలక్ష్మమ్మగారూ మీ అబ్బాయికి సునీతినిద్దామని వచ్చాన"న్నది.

సరే కట్నాలు కానుకలు స్థిరపడితే నాకేమి అభ్యంతరం లేదన్నది ఆ కొడుకును కన్నతల్లి హుందాగా.

వారం రోజుల్లో ముహూర్తం పెట్టి మూడెకరాల పొలం అమ్మి వీరమ్మ కడగొట్టు కూతురి వివాహం చేసింది.

పెళ్లికివచ్చిన లీల స్నేహితురాలు శారద, లీలనుగూర్చి అడిగి - అయినా మా ఊరి చాకలి కుర్రవాడు నక్క- తొక్కాడండి. అదృష్టంమీద అదృష్టం. లీల పెళ్లాడిందటగా.

ఎవరినిగూర్చి చెప్తున్నావు? సుబ్రహ్మణ్యం మా అల్లుడేపేరు కుర్రమైనవాడు, బుద్ధిమంతుడు, మా లీలకు తగినవాడు బ్రాహ్మణుడు.

అన్నీ నిజమే కాని బ్రాహ్మడు మాత్రం కాదు. చాకలి వాడు. వాళ్లన్నయ్య గుంటూరులో లాండ్రీ పెట్టుకున్నాడు.

దానికేం లే. మా మేనత్తకొడుకు నిఖరమైన బ్రాహ్మడు. మంగలి షాపు పెట్టాడు.

* ◆ *

వీరమ్మకు ఎవరి మొగం చూడడానికి ఇష్టంలేదు. మర్నాడే కనుపూరికి వెళ్లిపోయింది. మిగిలిన మూడెకరాల పొలంలోనిగింజలు పెట్టుకొని కాలక్షేపం చేస్తున్నది.

ఇప్పుడామె — పుష్పక విమానం మాయవిమానం గాదని మంచి విమానం అని అంటుంది. కాని దాంట్లో కూర్చోగానే జాతివాళ్ల బుద్ధులొస్తాయమ్మా! కులం గోత్రం అన్నీ మరిచిపోతాయి" అని అంటుంటుంద.

